సాక్షి
విశాఖపట్నం
బుధవారం। 12। ఫిబ్రవరి। 2025



అథ్లెటిక్స్‌లో
తల్లీ కూతుళ్ల ప్రతిభ 8లో



184 కిలోల
గంజాయి స్వాధీనం 8లో



వాలెంటైన్స్ డేకు
ప్రేమ కానుకలు 8లో

న్యూస్‌రీల్

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్, డీఆర్వో సీతారామారావు

విశాఖ విద్య: జిల్లాలో మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి సీతారామారావు ఆదేశించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. 10వ తరగతి పబ్లిక్, ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. జిల్లాలో 134 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,523, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 1,404 కలిపి మొత్తం 29,927 మంది హాజరవుతున్నట్లు డీఈవో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో వెల్లడించారు.

సింగపూర్‌లో భారత నేవీ తొలి శిక్షణ స్క్వాడ్రన్



స్క్వాడ్రన్ బృందం

సింథియా: ఐఎన్ఎస్ సుజాత, ఐఎన్ఎస్ శార్దూల్, ఐసీజీఎస్ వీరాలతో కూడిన ఫస్ట్ ట్రైనింగ్ స్క్వాడ్రన్ సింగపూర్‌లోని చాంగి నేవల్ బేస్‌లోకి ప్రవేశించినట్లు ఇండియన్ నేవీ అధికారులు తెలిపారు. ఆగ్నేయాసియాకు స్క్వాడ్రన్ యొక్క లాంగ్–రేంజ్ ట్రైనింగ్ డిప్లాయ్‌మెంట్‌లో భాగంగా ఈ సందర్శన జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పోర్ట్ కాల్ ప్రకారం సింగపూర్‌లో భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులే 1టీఎస్ నౌకలను సందర్శించారు. స్క్వాడ్రన్ శిక్షణ కార్యకలాపాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం సముద్ర శిక్షణార్థులతో సంభాషించిన ఆయన సముద్ర సహకారాన్ని పెంపొందించడంలో భారత నావికాదళం పాత్రను కొనియాడారు. ఐఎన్ఎస్ సుజాత, ఐసీజీఎస్ వీరా కమాండింగ్ అధికారులతో పాటు 1టీఎస్ సీనియర్ అధికారి కమాండర్ కల్నల్ రిన్సన్ చువాహాన్ లియోట్‌ను కలిసి పరస్పర ప్రయోజనాలపై చర్చించారు. ఈ పర్యటన సందర్భంగా భారత నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ మధ్య సహకారం, పరస్పర కార్యకలాపాల లక్ష్యాలను చర్చించినట్లు నేవీ వర్గాలు వెల్లడించాయి.

పేదల గూడు కూటమి కీడు



సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం లే అవుట్‌లో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లు

అనర్హుల పేరుతో ఇళ్ల స్థలాలు రద్దు చేసే యోచన

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలో 1.16 లక్షల మందికి ఇళ్ల స్థలాల కేటాయింపు
- ఇందులో చాలా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు
- అనర్హులను గుర్తించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- 15 రోజుల్లో పని పూర్తిచేయాలని ఉత్తర్వులు
- ఆందోళనలో లబ్ధిదారులు

మహారాణిపేట : పేదలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. గత ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని దూరం చేసే పనిలో నిమగ్నమైంది. మొన్నటివరకు దివ్యాంగుల పెన్షన్ల కోతపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల రద్దుకు సిద్ధమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చగా.. కూటమి ప్రభుత్వం నేడు ఆ కలను చిదిమేయడానికి పూనుకుంటోంది. అనర్హుల పేరుతో ఇళ్ల స్థలాల జాబితాను మళ్లీ పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. పరిశీలన బాధ్యతలను కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు అప్పగించారు. అనర్హులు ఎవరైనా ఇళ్ల పట్టాలు పొందినా.. ఆ ఇళ్ల స్థలాలను ఇతరులకు అమ్మినా.. ఎవరైనా కొన్నా ఆ కేటాయింపును రద్దు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 రోజులే సమయం

ఇళ్ల పట్టాల పరిశీలనకు కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజులు మాత్రమే సమయం ఇచ్చింది. ఈ వ్యవధిలోనే ఇళ్ల పట్టాలు పొందేందుకు తమకు అన్ని అర్హతలూ ఉన్నాయని లబ్ధిదారులు నిరూపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అందుకు సంబంధించి అర్హత పత్రాలు, గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయాలని కలెక్టర్‌కు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ నిబంధనలను పరిశీలించి ఆర్‌డీవోలు తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. అనర్హులుగా తేలితే ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని పేర్కొంది.

నిర్మాణంలో ఉన్న గృహాలు



మళ్లీ పరిశీలన ఎందుకు?


గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం **ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,005 లే అవుట్లలో** 1,15,933 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుచేసింది. లబ్ధిదారులకు పట్టాలు కూడా అందజేసింది. పలు లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టింది. ఇప్పటికే కొన్ని పూర్తి చేయగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ సమయంలో మళ్లీ పరిశీలన చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అన్నీ పరిశీలించి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని.. దీంతో ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నామని ఇప్పుడు వెరిఫికేషన్ చేయడం సరికాదని వాపోతున్నారు.



లోడగలవానిపాలెం లే అవుట్‌లో పూర్తయిన ఇళ్లు

సొంతింటి కల నెరవేర్చిన మాజీ సీఎం జగన్

పేదలందరికి సొంతింటి కలను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు కార్యక్రమం కింద ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,005 లే అవుట్లలో 1,15,933 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. మొత్తం మార్కెట్ రేట్ల ప్రకారం ఈ ఆస్తి విలువ రూ.1,600 కోట్లు పైబడి ఉంటుందని అప్పట్లో అంచన వేశారు. తర్వాత లే అవుట్లు అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు దాదాపు రూ.12 కోట్ల వరకు ఖర్చు చేశారు.



ఆనందపురం మండలం గిడిజాల లేఅవుట్‌లో ఇలా..

నిబంధనలు ఇలా..

ఇళ్ల స్థల లబ్ధిదారులకు పలు నిబంధనలను విధించింది. ఇప్పటికే ఇళ్ల పట్టాలు పొందిన వారికి అంతకుముందే ఇల్లు లేదా స్థలం ఉన్నా.. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా.. కారు లాంటి నాలుగు చక్రాల వాహనం ఉన్నా ఇళ్ల స్థలం రద్దు చేయాలని పేర్కొంది. అలాగే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి పట్టాలు ఉంటే ఒకరికి మాత్రమే ఉంచి, మిగతా వారివి రద్దు చేయాలన్న నిబంధనలు విధించింది. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అమ్మడం లేదా ఇతర లావాదేవీలు చేస్తే అలాంటి పట్టాలను రద్దు చేయాలని స్పష్టం చేసింది. దీని ఆధారంగా మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, పురపాలక, జీవీఎంసీ, యూసీడీ అధికారులు విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. లబ్ధిదారులు ఇచ్చే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. ఆ తర్వాత పట్టాల రద్దు నోటీసులు అందజేయడానికి సన్నాహాలు చేస్తోంది.

నామినేషన్లన్నీ ఓకే..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన
- 20కి గానూ 16 సెట్లను ఆమోదించిన ఆర్వో



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి జరుగుతున్న ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. ఒక్కో అభ్యర్థి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వారి వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు. కాగా.. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 10 మంది అభ్యర్థులు 20 సెట్లను సమర్పించారు. ఇందులో నాలుగు సెట్లు సరిగ్గా లేక పోవడంతో ఆర్వో తిరస్కరించారు. సత్తలూరి శ్రీరంగ పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, పోతల దుర్గారావు రెండేసి సెట్లు వేయగా వాటిల్లో ఒక్కొక్కటి తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించడంతో.. వాటిలో సరైన వాటిని పరిగణలోకి తీసుకొని ఆమోదించారు. పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి మూడేసి సెట్లు వేయగా అన్నీ అర్హత సాధించాయి. కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ ఒక్కో సెట్ వేయగా ఆమోదం పొందాయి. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదిస్తూ రిటర్నింగ్ అధికారి నిర్ణయం వెలువరించారు.

స్వల్పంగా పెరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

- 22,493 మంది ఓటర్లు
- 123 పోలింగ్ స్టేషన్లు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా.. ఈనెల 10వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించారు. వీటిని పరిశీలన అనంతరం కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఖరారు చేశారు.

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	3,416	1,619	5,035	31
విజయనగరం	3,270	1,953	5,223	29
మన్యం పార్వతీపురం	1,574	759	2,333	15
అల్లూరి సీతారామరాజు	920	568	1,488	11
విశాఖపట్నం	2,539	2,990	5.529	13
అనకాపల్లి	1,789	1,096	2,885	24
మొత్తం	13,508	8,985	22,493	123

గాజువాకలో ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి : గాజువాకలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి గజాల లోపు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇళ్లు, భవనాలు కట్టుకున్న వాటిని క్రమబద్ధీకరించాలని అందులో పేర్కొన్నారు. 2014–19లోనే టీడీపీ ప్రభుత్వం ఈ క్రమబద్ధీకరణలు చేయాలని చూసినా రకరకాల కారణాలతో సాధ్యం కాలేదు. ఇప్పుడు మళ్లీ క్రమబద్ధీకరణకు సంబంధించి కొత్త పథకాన్ని తీసుకురావడంతో దానిప్రకారం గాజువాక గ్రామంలోని భూములను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు.

రుషికొండ బీచ్‌లో స్కానర్ స్కాం



రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖ సిబ్బంది అక్రమాలు **ఒక్కొక్కటిగా** వెలుగులోకి వస్తున్నాయి. అధికారుల **పర్యవేక్షణ లో**పం కారణంగా సిబ్బంది ఇష్టారాజ్యంగా **వ్యవహరిస్తున్నారు**. మొన్న టికెట్ల దందా.. నిన్న టూరిజం **బోటింగ్‌లో** పర్యాటకుల నుంచి అదనపు వసూళ్లు వెలుగు **చూడగా..** తాజాగా నకిలీ స్కానర్‌తో సిబ్బంది అక్రమ **వసూళ్లకు** పాల్పడుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. **దాదాపు 8** నెలలుగా ఈ వ్యవహారం జరుగుతుందని **తెలిసి** అధికారులు అవాక్కయ్యారు. – కొమ్మాది

- వెలుగులోకి టూరిజం సిబ్బంది అక్రమాలు
- తాత్కాలికంగా బోటు షికారు నిలిపివేత



తీరం వద్ద భద్రపరిచిన టూరిజం బోట్లు

అంతర్జాతీయ గుర్తింపు పొందిన బ్లూ ఫ్లాగ్ బీచ్ రుషికొండ. ఇక్కడకు రోజూ వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది బోటు షికారు చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. దీనినే అదనుగా చేసుకుని సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పర్యాటక శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా.. ఉన్నతాధికారులు స్పందించి మూడు రోజులుగా ఇక్కడ ప్రతి అంశాన్నీ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో సిబ్బంది దందాలు, అక్రమ వసూళ్లు వెలుగులోకి వస్తున్నాయి.

నకిలీ స్కానర్‌తో అక్రమ వసూళ్లు

రుషికొండ బీచ్‌లో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో రెండు స్పీడ్ బోట్లు, నాలుగు ప్రైవేట్ స్పీడ్ బోట్లు నడుపుతున్నారు. బోటు షికారుకు వెళ్లే ఒక్కొక్క పర్యాటకుడి నుంచి రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది కేవలం తీరం నుంచి ఒకటిన్నర కిలో మీటరు వరకు మాత్రమే ప్రయాణించడానికి నిర్ణయించిన ధర. కాగా.. నిత్యం వందలాది మంది పర్యాటకులు దేశ, విదేశాల నుంచి రుషికొండ బీచ్‌కు చేరుకుని సరదాగా గడుపుతారు. వీరిలో రోజుకు సుమారు 250 మంది బోటు షికారు చేస్తారు. దీని వల్ల ఏపీ టూరిజంకు భారీ ఆదాయం వస్తోంది. అయితే ఇక్కడ పర్యాటకుల నుంచి స్కానర్ ద్వారా మాత్రమే డబ్బులు తీసుకుంటున్నారు. దీనిని అదనుగా తీసుకున్న నిర్వాహకులు టూరిజం శాఖకు చెందిన స్కానర్ పనిచేయడం లేదనో, సర్వర్ డౌన్ అని వివిధ కారణాలు చూపించి తమ సొంత స్కానర్‌తో డబ్బు వసూలు చేస్తున్నారు. దీని వల్ల నెలకు లక్షల్లో టూరిజం శాఖ ఆదాయం కోల్పోతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 8 నెలలుగా ఇంత జరుగుతున్నా అధికారులకు తెలియలేదా? లేదా ఈ వసూళ్లలో అధికారులకూ వాటా ఉందా అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఆర్డీ రమణారావు

నిలిచిన బోటు షికారు

మూడు రోజులుగా రీజనల్ డైరెక్టర్ వి.రమణారావు, డీఎం జగదీష్ ఇక్కడ జరుగుతున్న దందాలపై విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం బోటింగ్ నిర్వహణలో నకిలీ స్కానర్ అక్రమాలు బయటపడ్డాయి. దీంతో మేనేజర్ రజిత్‌కు నోటీసులు జారీ చేశారు. బోటు షికారులో నకిలీ స్కానర్ అక్రమాలపై లోతైన విచారణ చేపడుతున్నామని, తాత్కాలికంగా బోటు షికారు నిలిపివేస్తున్నట్లు ఆర్డీ రమణారావు తెలిపారు.

సురక్షిత ప్రయాణం.. క్షేమంగా గమ్యం

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, న్యాయవాదులు, ఆర్టీవో అధికారులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విశాఖ న్యాయవాదులు మంగళవారం రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జగదాంబ జంక్షన్ మీదుగా సీపీ కార్యాలయం వరకు సాగింది. సీపీ బాగ్చి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. 'నెమ్మదిగా వాహనాలు నడపండి.. ఎక్కువ కాలం జీవించండి.', 'జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాత్రమే క్రాస్ చేయండి.', 'సీట్ బెల్ట్ మీ భద్రతా కవచం.', 'రెడ్ సిగ్నల్ వద్ద ఆపండి... లైన్‌లో ఉండండి.', 'హెల్మెట్ ధరించండి.. క్షేమంగా గమ్యం చేరండి'అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, ఆర్టీవో సిబ్బంది, పలువురు న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

మీరు చెబితే.. మేం వినాలా?





పోలీసులు ఒక వైపు భద్రతా వారోత్సవాలతో హోరెత్తిస్తుంటే, మరోవైపు వాహనచోదకులు నిర్లక్ష్యం వహించడంలో ఏ మాత్రం తగ్గేదేలే అన్నారు. హెల్మెట్ లేకుండా, ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతూ రోడ్లపై యథేచ్ఛగా దూసుకుపోయారు. రహదారి భద్రతా నియమాలు పాటించాలని పోలీసులు ఎంత మొత్తుకున్నా.. వారి పక్క నుంచే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుకుంటూ వెళ్లడం గమనార్హం.

–ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చిరు వ్యాపారులపై కక్ష

పొట్టకొట్టిన కూటమి నేతలు



పూర్ణామార్కెట్‌లో తొలగించకుండా వదిలేసిన ఫుట్‌పాత్ ఆక్రమణలు



పూర్ణామార్కెట్‌లో ఫుట్‌పాత్‌పై మెట్లను తొలగించిన సిబ్బంది



మద్యం షాపు వద్ద ఫుట్‌పాత్‌పై వేసిన ఐరన్ గ్రిల్స్.. పట్టించుకోని అధికారులు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లోని చిరు వ్యాపారులపై కూటమి నేతల కక్ష సాధింపు చర్యలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. వందేళ్ల చరిత్ర కలిగిన పూర్ణామార్కెట్‌ను నమ్ముకుని చిరు వ్యాపారులు రోడ్డు పక్కన అమ్మకాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఆశీలు వసూళ్ల విషయంలో కొన్ని రోజులుగా వ్యాపారులతో తగదాలు జరుగుతున్నాయి. ఈ వివాదం ముదిరి, చివరకు చిరు వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలకు దారితీసింది. అధికారం ఉంది కదా అని కూటమి నేతలు అధికారులను పేద వ్యాపారులపై ఉసికొల్పి.. వారి పొట్టకొట్టారు. మొదటి రోజు పూర్ణామార్కెట్ పరిసరాల్లోని ఆక్రమణలు తొలగిస్తుండటంతో.. ప్రజలు, వ్యాపారులు సాధారణ ఆక్రమణల తొలగింపుగానే భావించారు. కానీ రెండో రోజు కూడా అధికార యంత్రాంగం బౌదారా రోడ్డు నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు ఆక్రమణల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసింది. కూటమి నేతల తీరుతో తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైన్ షాపులకు నిబంధనలు వర్తించవా?

బౌదారా రోడ్డులో రెండో రోజు ఆక్రమణల తొలగింపు పేరుతో దుకాణాల ముందున్న సిమెంట్ ర్యాంపులు, కొన్ని చోట్ల ఇనుప గ్రిల్స్‌ను అధికారులు తొలగించారు. ఎండ నుంచి రక్షణ కోసం దుకాణాల ముందు చేసుకున్న ఏర్పాట్లను సైతం తీసివేశారు. కానీ ఇదే రోడ్డులో ఉన్న వైన్ షాపుల వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను మాత్రం పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కక్ష సాధింపు బాధాకరం



పూర్ణామార్కెట్‌లో అనేక భవనాలు ఉన్నప్పటికీ కేవలం కక్ష పూరితంగా కొన్ని భవనాలకు చెందిన మెట్లను తొలగించారు. రెయిలింగ్ ధ్వంసం చేసి వాటర్ ట్యాంక్‌లు తీయించారు. చిరు వ్యాపారులపై ఒకలా.. వైన్ షాపులు ఉన్న దగ్గర మరో విధంగా వ్యవహరించారు. వన్‌టౌన్ ప్రధాన రహదారిలో ఆక్రమణలు ఉన్నాయి. వాటిని వదిలి చిరు వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలకు దిగి దుకాణాలు తొలగించడం సమంజసం కాదు.

– కొండా రాజీవ్‌గాంధీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అగ్నిప్రమాదంలో రోబోట్లు దగ్ధం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగి రెండు రోబోట్లు, ఒక ప్యానల్ బోర్డు పూర్తిగా కాలిపోయాయి. సర్వే నంబర్ 230లో ఉన్న ఆజాద్ వీటీసీ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ సంస్థలో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అప్పటికే రోబోట్లు కాలిపోయాయని అగ్నిమాపక అధికారి జి. శ్రీనివాసరాజు తెలిపారు. వీటి విలువ రూ.1.50కోట్లు ఉండవచ్చని అంచనా.. అయితే వాటి యజమాని వచ్చే వరకు నష్టం అంచనా వేయలేమని అగ్నిమాపక అధికారి తెలిపారు.

టీ విక్రయిస్తూ.. తిరిగిరాని లోకాలకు..

కారు ఢీకొని టీ విక్రయదారుడి దుర్మరణం



సంఘటనా స్థలంలో నర్సింహారావు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం : సైకిల్‌పై టీ విక్రయించే వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ గేటు మధ్య ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన మొరాల నర్సింహారావు (55) షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద లారీ పార్కింగ్ చేసిన ప్రాంతాల్లో సైకిల్‌పై టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ గేటు వైపు వెళ్తున్న కారు నర్సింహారావును ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

184 కేజీల గంజాయి స్వాధీనం

- గాజువాకలో ఒక ఇంటిపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల తనిఖీలు
- 8 మంది అరెస్ట్.. ఒడిశా నుంచి తీసుకొచ్చినట్లు అంగీకారం

విశాఖ సిటీ: గాజువాకలో ఒక ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో 184 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు డీసీపీ–2 మేరీ ప్రశాంతి తెలిపారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ గాజువాక వుడా కాలనీ ప్రాంతంలోని ఓ ఇంట్లో గంజాయి ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందిందని పేర్కొన్నారు. గాజువాక పోలీసులతో కలిసి మంగళవారం ఉదయం 7.30 గంటలకు ఆ ఇంట్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. 94 ప్యాకెట్లలో 184 కిలోల గంజాయిని గుర్తించారన్నారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని ఒడిశా రాష్ట్రం కోరాపుట్ నుంచి తీసుకువచ్చినట్లు చెప్పారు. నిందితులు ఇమ్రాన్ ఖాన్, కోరాడ బాలాజీకృష్ణ, బిదేశికుమార్ సాహు, దామా ఖరా, శుక్ర మతం, రామచంద్ర సిషా, మనోజ్ ఖేముండు ఒడిశాకు చెందిన వారు కాగా, అర్జున్‌కుమార్ రాజస్తాన్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు. విశాఖలో గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఇటువంటి వారిపై షీట్స్ ఓపెన్ చేస్తున్నామని, పాత కేసులు ఉంటే బెయిల్ రాకుండా చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలు గర్హనీయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ ఉద్యోగులు

- 1/70 సహా గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదు
- నల్ల రిబ్బన్లతో గిరిజన సంఘాల నిరసన

డాబాగార్డెన్స్: ఏజెన్సీలో పర్యాటకాభివృద్ధికి 1/70 చట్టంలో సడలింపులు చేయాలన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై గిరిజన ఉద్యోగులు మండిపడ్డారు. అయ్యన్న చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ.. మన్యం బంద్‌లో భాగంగా మంగళవారం డాబాగార్డెన్స్ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ రిజర్వేషన్ సంరక్షణ సేవా సంఘం, ఐక్య వేదిక, విశాఖ జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో కళ్లకు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. రాజ్యాంగ పరిధిలోని అసెంబ్లీ స్పీకర్ 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించాలని, దీనిపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం, ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం అమలు చేయాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు, పలువురు నేతలు ఈ నిరసనలో పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీవిశ్వ విద్యార్థుల సత్తా



అంజూరి తారక్‌రామ్ | షణ్ముఖ నాయుడు | వెంకట హేమ వర్ధన్ | కె.వి.కుటుంబ నిహార్ | ఎస్.మురళీకృష్ణ | యు.జయంత్ కుమార్

సీతంపేట: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాలకు చెందిన 212 మంది విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీల్లో సీటు పొందే పర్సంటైల్ సాధించినట్లు సంస్థ చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. అంజూరి తారక్‌రామ్ 99.87 పర్సంటైల్, బంటు షణ్ముఖనాయుడు 99.78, కె.వి. కుటుంబ నిహార్ 99.70, సిహెచ్.వెంకట హేమ వర్ధన్ 99.66, యు.జయంత్ కుమార్ 99.44, ఎస్.మురళీకృష్ణ 99.30, సిహెచ్ షణ్ముఖ సాయి వర్మ 99.22, బోర పవన్ కుమార్ 99.11 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఎనిమిది మంది విద్యార్థులు 99 పర్సంటైల్, 37 మంది 98 పర్సంటైల్ పైగా సాధించడం విశేషమన్నారు. విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తో పాటు అధ్యాపక సిబ్బంది అభినందించారు.

శ్రీరామానుజ విద్యార్థుల ప్రతిభ

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని శ్రీరామానుజ జూనియర్ కళాశాల విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ రామ దత్తాత్రేయ్ తెలిపారు. విద్యార్థి ఉజ్వల్ 98.619 శాతం పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు. అలాగే తమ విద్యార్థులు ఫిజిక్స్‌లో 97.057, కెమిస్ట్రీలో 99.717, మ్యాథ్స్‌లో 98.309 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఉజ్వల్‌తో పాటు 95 శాతం పర్సంటైల్ సాధించిన ముగ్గురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. జేఈఈ రెండో సెషన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల విజయకేతనం



విక్రమ రాజా | హరిచరణ్ | ప్రతాప్

విశాఖ విద్య: జేఈఈ మెయిన్స్(సీజన్–1) ఫలితాల్లో శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ ఉత్తరాంధ్ర విద్యార్థులు సత్తాచాటారు. పర్సంటైల్, అదే విధంగా మార్కుల సాధనలోనూ శ్రీ చైతన్య విద్యార్థులు జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచారు. బి.విక్రమ రాజా (99.997 పర్సంటైల్), డీజీఎస్‌డీ ప్రతాప్ (99.994), ఎస్.హరిచరణ్(99.98) అత్యుత్తమ పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో రాణించినట్లు శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ, డీన్లు ఎస్.రఘుకుమార్, కె.బంగారుబాబు తెలిపారు.

ఎసెంట్ విద్యార్థుల విజయదుందుభి



వాసవీప్రియ | కౌసల్ హిరావత్

మద్దిలపాలెం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు విజయ ర్యాంకుల పరంపర కొనసాగించారు. కళాశాలకు చెందిన కౌసల్ హిరావత్ 99.89 పర్సంటైల్, కాగితపల్లి వాసవీప్రియ 99.86 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. 99 పర్సంటైల్ మార్కులతో 16 మంది, 98 పర్సంటైల్‌తో 28 మంది, 95 పర్సంటైల్ మార్కులతో 62మంది, 90 పర్సంటైల్‌తో 110 మంది అర్హత సాధించినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు జ్యోతి



జాతీయ క్రీడల్లో విజేత జ్యోతి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ అథ్లెట్ జ్యోతి యర్రాజీ ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించింది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ గేమ్స్ వంద మీటర్ల హర్డిల్స్‌లో తన మీట్ రికార్డును తనే తిరగరాసుకున్న విషయం తెలిసిందే. ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఈ ఏడాది దక్షిణ కొరియాలోని గుమిలో జరగనుండగా... జ్యోతి భారత్ తరపున ఫాస్టెస్ట్ హర్డిలర్స్ పోటీలో తలపడనుంది. ఇదిలా వుండగా మంగళవారం జరిగిన జాతీయ క్రీడల 200 మీటర్ల మహిళల పరుగులోనూ విజేతగా నిలిచింది. లక్ష్యాన్ని 23.35 సెకన్లలో చేరుకుని స్వర్ణాన్ని అందుకుంది. డెహ్రాడూన్‌లో జరిగిన ప్రిలిమినరీ హీట్‌లో జ్యోతి 23.85 సెకన్లలోనే పూర్తి చేసేయగా... హీట్స్‌లో అందరు అథ్లెట్లు 24 సెకన్ల పైబడే పూర్తిచేశారు.

ఇన్‌చార్జ్ డీటీవోగా శ్రీనివాసరావు



గోపాలపట్నం: విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జ్ డీటీవోగా ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఉప రవాణా కమిషనర్ ఆంజనేయులు పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్‌టీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈయనే సీనియర్ అధికారి. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించలేదని ఆయన తెలిపారు. సీనియారిటీ లిస్టులో ఉన్న ఆయనకు పూర్తి బాధ్యతలు ఇచ్చేందుకు మరో 15 రోజులు పడుతుందని సమాచారం.

నిరుద్యోగులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో టయోట్స్ రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో సీఎన్‌సీ ఆపరేటర్, ఇన్వెంటరీ కంట్రోలర్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉపాధి ఆధారిత కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సీఈవో సేతు మాధవన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు. ఆసక్తి కలిగిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థులు సింధియా జంక్షన్ సమీపంలోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 83319 01237, 0891–2704010 ఫోన్ నంబర్లలో గానీ ఈ నెల 17వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

సుజుకి యాక్సెస్ 125 సరికొత్త మోడల్ ఆవిష్కరణ



స్కూటర్ ఆవిష్కరిస్తున్న వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్

బీచ్‌రోడ్డు: సుజుకి టూ వీలర్స్ అగ్రశ్రేణి డీలర్ పద్మజ సుజుకి సిరిపురం షోరూం వద్ద అత్యంత ప్రజాదరణ పొందుతున్న సుజుకి యాక్సెస్ 125 సరికొత్త మోడల్‌ను ఆవిష్కరించారు. వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్ దేవ్ కొత్త యాక్సెస్ స్కూటర్‌ను మంగళవారం విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభు కిశోర్ మాట్లాడుతూ సరికొత్త సుజుకి యాక్సెస్ గొప్ప పికప్, మైలేజ్, అత్యుత్తమ నాణ్యతతో లభిస్తోందన్నారు. ఎల్‌ఈడీ డీఆర్ఎల్‌తో క్లాసిక్ అర్బన్ డిజైన్, హజార్డ్ లైట్, కొత్త ఎల్‌ఈడీ టైల్ ల్యాంప్స్, స్మూత్ స్టార్ట్ కోసం వన్ వే క్లచ్, ఉత్తమ పికప్ కోసం 10.2 ఎన్ఎం, 5000 ఆర్పీఎం టార్క్ మోటార్‌తో ఈ స్కూటర్ రూపుదిద్దుకుందన్నారు. ఉత్తమ యాక్సిలరేషన్, తక్కువ ఎమిషన్, ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీతో పాటు, 5.3 లీటర్ల పెట్రోల్ ట్యాంక్ కెపాసిటీ ఉంటుందన్నారు. ఇందులో పొందుపరిచిన సరికొత్త డిజిటల్ డిస్‌ప్లేలో సర్వీస్ రిమైండర్ అలర్ట్స్, వెదర్ యాంబియంట్ అలర్ట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి సేవ్ చేసుకునేందుకు డిజిటల్ వాలెట్, క్యాలెండర్ రిమైండర్ అలర్ట్స్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయని వివరించారు. వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.వినోద్ కుమార్, పద్మజ సుజుకి జీఎం రఫీ, పద్మజ సుజుకి సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో వర్షపు నీటి లీకేజీకి చెక్



సింహాచలం : శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వర్షపు నీటి లీకేజీలకు పూర్తిగా చెక్ పెట్టేందుకు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కొండపై ఆనంద నిలయంలో జరిగిన అవగాహన ఒప్పంద కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రాంతాల్లో ఆలయాల పైకప్పుల లీకేజీలను నిరోధించడంలో అనుభవం ఉన్న పుణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్, రెలిజియస్ ట్రస్ట్ తన సొంత నిధులతో ఆలయంలో పనులకు ముందుకు వచ్చిందన్నారు. దేవస్థానంలో దేవాలయం, నివేదన శాలలో పనులు ప్రారంభించడానికి సంసిద్ధత వ్యక్తం చేసిందని వెల్లడించారు. 9 నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ కె.మునిరత్నం, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ రామేయిల్ సింగ్ జెంబాల్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, అధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో తల్లీకూతుళ్ల ప్రతిభ



ఐదు కిలోమీటర్ల పరుగు పందెం పోటీలో ప్రథమ స్థానంలో గెలిచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అపర్ణ

భీమునిపట్నం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భీమిలికి చెందిన తల్లీకూమార్తె ప్రతిభ చూపారు. ఇటీవల అనంతపురంలో 43వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో 60 ఏళ్లు పైబడిన కేటగిరీ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో కందుకూరి లావణ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగులో విజేతగా నిలవగా, 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తాచాటారు. ఆమె కుమార్తె రేపాక అపర్ణ 30 ఏళ్లు పైబడిన కేటగిరీలో 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, ఐదు కిలోమీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఇద్దరినీ స్థానికులు అభినందించారు.

ప్రేమ కానుకలు











300లకుపైగా

మరో రెండు రోజుల్లో ప్రేమికుల పండగ.. ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే కోసం యువత ఎంతగా ఎదురు చూస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రేమను వ్యక్తపర్చడానికి ఒక ప్రత్యేకమైన రోజు. రకరకాల బహుమతులు తమకిష్టమైన వాళ్లకు ఇచ్చి ప్రేమను వ్యక్తం చేస్తారు. కొన్ని బహుమతులు కేవలం లవ్ ప్రపోజ్ చేయడానికే అన్నట్టు అందుబాటులో ఉన్నాయి. తను ప్రేమించే వారి హృదయాన్ని హత్తుకునేలా గిఫ్ట్ ఇవ్వాలని అన్వేషిస్తుంటారు. ఇటువంటి వారికి కోసం వాలెంటైన్స్ డే కానుకలు మార్కెట్లో కొలువుదీరాయి. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్ పాలబూత్ సెంటర్ వద్ద ముంబయి నుంచి తెచ్చిన సుమారు 300లకుపైగా ఆకర్షణీయమైన వాలెంటైన్స్ డే గిఫ్ట్ ఆర్టికల్స్ ప్రేమాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అంతేకాకుండా యువతను ఆకర్షించేలా తన షాపును హార్ట్ షేప్ తోరణాలతో, భారీ లవ్ సింబల్‌తో అలంకరించారు. దీంతో యువత పెద్ద సంఖ్యలో కానుకలు కొనుగోలు చేస్తున్నారు. లవ్ సింబల్ షేపులో ఉండే ఫొటో ఫ్రేమ్‌లు, గిఫ్ట్ హ్యాంపర్స్, షో పీసెస్, వాచెస్, కీచైన్స్, వాల్ హ్యాంగింగ్స్, టాయ్స్, జ్యూయలరీ, ఆల్బమ్స్, కాఫీమగ్స్, మేకప్ సెట్, రోజెస్, క్రిస్టల్, స్టోన్ డెకరేటివ్ ఐటెమ్స్, పెర్ఫ్యూమ్స్, బుక్స్, గ్రీటింగ్స్, చాక్‌లెట్స్, కుషన్స్, ల్యాంప్స్, మ్యూజిక్ షోపీస్ ఇలా ఎన్నో రకాల బహుమతులు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. లైటింగ్ బొకేలు, లైటింగ్ ఫొటో ఫ్రేమ్స్, లవ్ సింబల్స్, హార్ట్ షేప్ డెకరేటివ్ ఐటమ్స్, షో పీసెస్, లవ్ మెసేజ్ బాటిల్స్ వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సీతంపేట